క్లుప్తంగా

వైభవంగా చండీయాగం


మాతృశ్రీనగర్‌తో హోమం జరిపిస్తున్న దామా సుబ్బారావు దంపతులు

కూర్మన్నపాలెం: 88వ వార్డు మాతృశ్రీనగర్‌లోని అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో శనివారం చండీయాగం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు దామా సుబ్బారావు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగిరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో జెడ్పీ సింహాచలం, పార్టీ వార్డు అధ్యక్షుడు వెలుగుల పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

విండ్‌బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభం


ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న అతిథులు

గాజువాక: జీహెచ్‌ఆర్ యూత్ ఆధ్వర్యంలో గాజువాక హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన విండ్‌బాల్ క్రికెట్ పోటీలను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా చినతల్లి ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించనున్న పోటీల్లో 25 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ.10 వేలు, రూ.6వేలు నగదుతో పాటు ట్రోఫీలు అందిస్తామన్నారు. క్రికెట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరీ ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లా పెంటారావు, నిర్వాహకులు గణేష్, మధు, జగదీష్, బీజేపీ నాయకుడు గూటూరు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే పోలీస్ ధ్యేయం


ర్యాలీలో పాల్గొన్న సీఐ జి.డి.బాబు, ఎస్‌ఐ నాగరాజు

మల్కాపురం: పోలీసులు అంకితభావంతో విధులు నిర్వహిస్తారని మల్కాపురం సీఐ జి.డి.బాబు అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా శనివారం సిబ్బందితో కలిసి సీఐ జి.డి.బాబు విధి నిర్వహణలో అమరులైన పోలీసుల ఆత్మకు శాంతి కలగాలని ర్యాలీ మల్కాపురం నుంచి శ్రీహరిపురం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ అంటే ప్రజలకు ఒక భరోసా అని,పోలీస్ అంటే ప్రజలకు ఒక నమ్మకం అని అన్నారు. ప్రజల నమ్మకానికి అనుగుణంగా తమ వ్యవస్థ ఎల్లప్పుడూ నడుచుకుంటుందన్నారు. విధి నిర్వహణలో అమరులైన వారి సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కాగ్నిటివ్ డిజిటల్ థెరపీ కేంద్రం ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగంలో ఏర్పాటు చేసిన అధునాతన కాగ్నిటివ్ డిజిటల్ థెరపీ కేంద్రాన్ని శనివారం ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ప్రారంభించారు. అనంతరం కేంద్రం పని తీరును పరిశీలించారు.తరువాత విద్యార్థులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విశ్రాంతి గదిని విద్యార్థినితో వీసీ ప్రారంభింపజేశారు. విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ వ్యక్తిలో మానసిక సమస్యను గుర్తించడం, డిప్రెషన్, ఒత్తిడి స్థాయిలు, ఏంగ్జయిటీ, ఎమోషన్స్ వంటివి కాగ్నిటివ్ డిజిటల్ థెరపీ సహాయంతో గుర్తించడం సాధ్యపడుతుందన్నారు. ఆత్మహత్యల నివారణకు ఇది ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వేద వినుత.. జ్ఞాన ప్రదాత


అన్నపూర్ణాదేవి అలంకరణలో కన్యకా పరమేశ్వరి


ఎల్వీ నగర్‌లో రాజరాజేశ్వరి దేవిగా కనకదుర్గ అమ్మవారు


పోలమాంబ అమ్మవారికి కరెన్సీతో అలంకరణ


లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో దుర్గాలమ్మ


త్రిశక్తి దేవాలయంలో సరస్వతీదేవిగా శ్రీ మహాదుర్గ


త్రిశక్తి దేవాలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయిస్తున్న తల్లిదండ్రులు

గాజువాక: శరన్నవరాత్రి మహోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ఏడో రోజు అమ్మవారిని లలితా త్రిపురసుందరిగా, అన్నపూర్ణగా విభిన్న రూపాల్లో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. శక్తిస్వరూపిణి, వేదాలు స్తుతించే జ్ఞానస్వరూపిణి అయిన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. త్రిశక్తి ఆలయంలో దుర్గాదేవిని సరస్వతీదేవిగా అలంకరించి, చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు.

అన్నపూర్ణగా కన్యకాపరమేశ్వరి

గాజువాక కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. గాజువాక ఆర్యవైశ్య సంఘం, దసరా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

రాజరాజేశ్వరిగా కనకదుర్గమ్మ

శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా 70వ వార్డు ఎల్వీ నగర్ కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని శుక్రవారం రాజరాజేశ్వరి దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం ప్రసాద వితరణ చేశారు.

ధనలక్ష్మిగా పోలమాంబ

అక్కిరెడ్డిపాలెం: ఎస్టీబీఎల్‌లోని ఎల్ఎస్ గార్డెన్స్‌లో కొలువైయున్న పోలమాంబ అమ్మవారు శనివారం ధనలక్ష్మిగా దర్శనమిచ్చారు. రూ.10, 20, 50, 100, 500 నోట్లతో మొత్తం రూ.2 లక్షల కరెన్సీతో అమ్మవారిని అలంకరించారు.

లలితా త్రిపుర సుందరిగా దుర్గాలమ్మ

అగనంపూడి: దుర్గాలమ్మ అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని ముడుపులు, చీరలు, సారె సమర్పించారు. కుంకుమ పూజలు చేశారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి లలిత, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. లక్కీ డిప్ ద్వారా గెలుపొందిన విజేతలకు చీరలు పంపిణీ చేశారు. ఆలయ, ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశాయి.

త్రిశక్తి ఆలయంలో అక్షరాభ్యాసాలు

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి ఆలయంలో మహాదుర్గ అమ్మవారు కనకాంబరం వర్ణం చీరలో సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో శనివారం సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. పెద్ద ఎత్తున హాజరైన బాలబాలికలకు రుత్వికుల సమక్షంలో శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసాలు జరిగాయి. శ్రీమహాలక్ష్మి అమ్మవారు పసుపు వర్ణం చీరలో ధాన్యలక్ష్మిగా, శ్రీమహాసరస్వతి అమ్మవారు చందనం వర్ణం చీరలో కౌమారిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవార్లకు సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం బాలలచే సామూహిక సరస్వతీ పూజ, సహస్ర శ్వేత కుసుమార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


ధర్మాల వీధిలో నవదుర్గల వేషధారణలు


లక్కీడిప్ విజేతలకు చీరలు అందిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఎల్‌డీసీ విభాగంలో దసరా పూజ

స్టీల్‌ప్లాంట్ ఎల్‌డీసీ విభాగంలో శనివారం దసరా పూజ చేశారు. విభాగం వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు ఎ.కె.బాగ్చీ, ఎస్.సి.పాండే, సీజీఎం గాంధీ, విభాగాధిపతి ఎస్.భాను, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు జన నీరాజనం

పెదగంట్యాడ: 75వ వార్డు మొల్లి సన్యాసిరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారిని శనివారం మహాలక్ష్మిగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో మెరిండా బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

- పెంటమాంబ యూత్ నెల్లిముక్కు ఆధ్వర్యంలో ధర్మాల వీధిలో అమ్మవారిని లలితా పరమేశ్వరి దేవి (కూష్మాండ)గా అలంకరించారు. పలువురు మహిళలు నవదుర్గలుగా వేషధారణలో అలరించారు. అనంతరం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు.
- 77వ వార్డు నమ్మిదొడ్డి జంక్షన్‌లో కొలువుదీరిన అమ్మవారిని కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి దర్శించుకున్నారు.
- 65వ వార్డు ప్రియదర్శిని కాలనీలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి సారె సమర్పించారు. ముందుగా సారెను వీధుల్లో ఊరేగించారు. కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


నమ్మిదొడ్డి జంక్షన్‌లో అమ్మవారి సన్నిధిలో కార్పొరేటర్ సూర్యకుమారి


65వ వార్డు ప్రియదర్శినీ కాలనీలో అమ్మవారి సారె ఊరేగింపు

- వినాయకనగర్ వుడా కాలనీలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు.


ధాన్యలక్ష్మి అవతారంలో శ్రీ మహాలక్ష్మి


కౌమారి అలంకరణలో శ్రీమహాసరస్వతి


సీతానగరంలో మహాలక్ష్మి అవతారంలో దుర్గాదేవి


వుడా కాలనీలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో కుంకుమపూజలు

రూ.2 కోట్లతో కైలాసభూముల్లో వసతుల కల్పన

అగనంపూడి: జీవీఎంసీ పరిధిలోని గ్రామాల్లో శ్మశాన వాటికల అభివృద్ధికి, వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. 79వ వార్డు లంకెలపాలెంలోని రెండు శ్మశాన వాటికల ప్రహరీగోడలు, షెడ్ల నిర్మాణంతో పాటు నీటి వసతి కల్పించడం, ఆవరణాన్ని చదును చేయడం వంటి పనుల కోసం రూ.రెండు కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. అంతిమయాత్రలో పాల్గొనే మృతుల బంధువులు, సన్నిహితులు ఇబ్బంది పడకుండా ఉండడం కోసం కైలాస భూముల్లో వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, వార్డు వైఎస్సార్సీపీ ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు, సీనియర్ నాయకులు సుందరపు అప్పారావు, కర్రి నరసింగరావు, యలమర్తి వెంకటరావు, కాతా నూకేష్, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.


లంకెలపాలెంలో శ్మశాన వాటికల అభివృద్ధికి శంకుస్థాపన చేస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

982వ రోజుకు ‘ఉక్కు’ రిలే దీక్షలు

కూర్మన్నపాలెం: దేశంలోనే పెద్ద పరిశ్రమగా అవతరించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్రప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అమ్మాలనుకోవడం దారుణమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 982వ రోజు, శనివారం ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమరవీరుల ప్రాణత్యాగాలతో నిర్మించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం కానివ్వబోమన్నారు. నిరంతరాయంగా పోరాటాన్ని కొనసాగించడం ద్వారా కేంద్రప్రభుత్వంపై ప్రతిఘటన మరింత పెరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన కార్మికులు తలచుకుంటే ఉక్కు పరిశ్రమలోని ఒక్క రేకును కూడా కదల్చలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిరంకుశత్వ నిర్ణయాన్ని వదిలి కార్మికులకు అండగా నిలబడాలని, కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.


982వ రోజు దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

ఘనంగా అమృతరావు జయంతి


స్మృత్యంజలి పార్క్ వద్ద అమృతరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉక్కునగరం: ఉక్కు ఉద్యమనేత టి.అమృతరావు 103వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద ఉన్న స్మృత్యంజలి పార్క్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో అమృతరావు విగ్రహానికి వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త దేవన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం కోసం ప్రాణత్యాగానికి సిద్ధమైన అమృతరావు చిరస్మరణీయుడని కొనియాడారు. వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప అధ్యక్షత వహించిన కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు మాటూరి శ్రీనివాసరావు, నీరుకొండ రామచంద్రరావు, బి.అప్పారావు, రమణయ్య, మార్టుపూడి పరదేశి, డి.సంపూర్ణం, కె.దాలినాయుడు, వరసాల శ్రీనివాస్, కారు రమణ, పిట్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమృతరావు సేవలు మరువలేం

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అంటూ 23 రోజుల పాటు నిరాహారదీక్ష చేసిన అమృతరావు సేవలు మరువలేమని మంత్రి శంకరనారాయణ అన్నారు. ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నడుపూరులో అమృతరావు జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మంత్రి గోపీ, అవతారం, పి.భాస్కరరావు, పల్లం గోపీ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

ఉక్కునగరం: కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి సమీపంలో శనివారం రాత్రి కారుతో ఢీకొనడంతో ద్విచక్రవాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాలివి.. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కంది వెంకట ఉదయకిరణ్ శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై కూర్మన్నపాలెం ఆర్చి నుంచి స్టీల్‌ప్లాంట్ వైపు వెళ్తున్నారు. అదే సమయంలో టౌన్‌షిప్‌కు చెందిన హర్ష రోహిత్ టొప్పో తన స్నేహితుడు అర్పిత్ టొప్పోతో కలిసి కూర్మన్నపాలెం వైపు కారులో వెళ్తున్నారు. ఆర్చి సమీపంలో స్కూటర్ షెడ్డు వద్ద వారు కారుతో బలంగా ఢీకొట్టారు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన ఉదయ కిరణ్ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అదే సమయంలో అటుగా ప్రయాణిస్తున్న ఓ యువకుడు కిరణ్‌కు సీపీఆర్ చేసి ఊపిరి ఉందని చెప్పటంతో వెంటనే గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ ఎస్‌ఐ మహాలక్ష్మి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేశారు. ప్రస్తుతం కిరణ్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది.


అపస్మారక స్థితికి చేరిన కిరణ్

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

- శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠింపజేశారు. అష్టోత్తరంపూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి


75వ వార్డులోని శిబిరంలో ఆరోగ్య సురక్ష కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు


కణితి పీహెచ్‌సీ పరిధిలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది


రక్తపరీక్షలు చేస్తున్న సిబ్బంది


75వ వార్డులోని శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్‌బాబు


దువ్వాడ యూపీహెచ్‌సీలో రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, దామా సుబ్బారావు


వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ: ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అందులో భాగంగా రూపొందించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయన్నారు. 75వ వార్డు పాత అయ్యన్నపాలెం సచివాలయ పరిధి పట్టణ ఆరోగ్య కేంద్రంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీ కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్న సత్సంకల్పంతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

263 మందికి వైద్యసేవలు

శిబిరంలో 263 మందికి 7గురు వైద్యులు సేవలు అందించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారులు రమేష్ బాబు, హేమలత, ఈఎన్‌టీ డాక్టర్ నాగరాజు, శస్త్ర చికిత్సల నిపుణులు డాక్టర్ లతకుమారి, నేత్ర వైద్యులు డాక్టర్ అలేఖ్య, దంత వైద్యులు కె.లక్ష్మి, జనరల్ వైద్యులు డాక్టర్ కె.నరసింహమూర్తి శిబిరంలో పాల్గొని, రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి వైద్యుల సూచనల మేరకు సిబ్బంది రక్తపరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జీవన్ రాణి, ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, క్లస్టర్ మండల అధ్యక్షుడు రాజాన వెంకటరావు, బొడ్డ గోవింద్ నాయకులు పాల్గొన్నారు.

86వ వార్డు డాక్‌యార్డ్ కాలనీలో..

కూర్మన్నపాలెం: 86వ వార్డు డాక్‌యార్డ్‌కాలనీలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ శిబిరాలను వినియోగించుకోవాలని రోగులకు సూచించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారులు నళిని పుష్పలత, డాక్టర్ భానుజతో కలిసి మొత్తం ఏడుగురు వైద్యులు పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు చేశారు.

- దువ్వాడ యూపీహెచ్‌సీ పరిధిలో మొత్తం 181 మందికి వైద్య సేవలను అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు మెడికల్ బాబు, చేగొండి శ్రీనివాసరావు, పత్తిపాటి శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
- 87వ వార్డు కణితి పీహెచ్‌సీలో తిరుమలనగర్ సచివాలయ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి శిబిరాన్ని పరిశీలించారు. సుమారు 286 మంది ప్రజలు వైద్య సేవలను పొందినట్లు అధికారులు తెలిపారు. ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంఘటితంగా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా సంఘటితంగా కాపాడుకుందామని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. స్థానిక అంబేడ్కర్ కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన ఏఐటీయూసీ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపుతుందన్నారు. ప్రైవేటీకరణను ఉపసంహరించుకునేంత వరకు ఐక్య పోరాటం కొనసాగుతుందన్నారు. బీఎఫ్–3ని జిందాల్ లాంటి ప్రైవేటు వారికి ఇచ్చి నడిపిస్తామంటే ఒప్పుకోబోమన్నారు. దానికి ఉక్కు యాజమాన్యమే పునఃప్రారంభించి పూర్తి స్థాయిలో నడిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్టీల్ ఏఐటీయూసీ నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, జె.రామకృష్ణ, మసేనురావు, డి.నర్సింగరావు, నరేష్‌కుమార్, మిశ్రా, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.